# నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 146 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
09-04-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# హక్కుల పోరాటానికి ఐఎఫ్‌డబ్ల్యూజే సిద్ధం




- జిల్లాలో ఐఎఫ్‌డబ్ల్యూజే యూనిట్ ఆవిర్భావం
- రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు వేగం
- అక్రిడిటేషన్ సమస్యలపై పోరాటానికి సన్నద్ధం
- పత్రికా స్వేచ్ఛపై పెరుగుతున్న ముప్పు
- సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం
- జర్నలిస్టుల హక్కుల సాధనలో రాజీ లేదు: ఈశ్వరరావు
- మీడియా బలమే ప్రజాస్వామ్యానికి బలం: జోగినాయుడు
- ఐక్యతతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం: మల్లేశ్వరరావు





**నవతరం -శ్రీకాకుళం, ప్రతినిధి**

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తి గౌరవం కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐ ఎఫ్ డబ్ల్యు జె) రాష్ట్రవ్యాప్తంగా దూకుడు ప్రదర్శిస్తోందని రాష్ట్ర ఇంచార్జ్, జాతీయ కమిటీ సభ్యుడు ఎన్. ఈశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో జరిగిన సమన్వయ కమిటీసమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో యూనియన్ శాఖలను ఏర్పాటు చేసి జర్నలిస్టుల సమస్యలపై సమగ్రంగా పోరాటం చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నాయకులతో సంప్రదింపు జరిపేమన్నారు.

-మిగతా 2లో

# అమరావతి ఒక అంతులేని దోపిడీ..

- రాజధానిగా 'మావిగన్' మాత్రమే ఆచరణ సాధ్యం
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



**నవతరం -శ్రీకాకుళం**

ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను భ్రమల్లో ముంచుతూ, అమరావతి పేరుతో చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తున్నారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ధ్వజమెత్తారు.బుధవారం శ్రీకాకుళంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..చంద్రబాబు అవలంబిస్తున్న విధానాలు కేవలం దోపిడీ కోసమే తప్ప రాష్ట్రాభివృద్ధి కోసం కాదని విమర్శించారు 2014లో 50 వేల ఎకరాలు చాలని చెప్పిన బాబు, ఇప్పుడు లక్ష ఎకరాలు కావాలని అడగడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని,లక్ష ఎకరాల్లో మౌలిక సదుపాయాల కోసమే రూ. 2 లక్షల కోట్లు ఖర్చువుతాయని,రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇది ఇప్పట్లో పూర్తయ్యే పని కాదని ఆయన స్పష్టం చేశారు.?అమరావతి నిర్మాణ వ్యయంపై తమ్మినేని సంచలన గణాంకాలు బయటపెట్టారు.దేశ రాజధాని ఢిల్లీ 10,500 ఎకరాల్లో విస్తరించి ఉంటే, అక్కడ చదరపు అడుగుకు రూ. 4 వేలు ఖర్చు చేశారని.. కానీ అమరావతిలో చదరపు అడుగుకు రూ.14 వేలు ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు తెలంగాణ సచివాలయం 28 ఎకరాలలో 10 లక్షల ఎస్ ఎఫ్ టీ 615 కోట్లు ఖర్చు చేస్తే దేశ పార్లమెంట్ 970 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆ భవనాలు కంటే అమరావతి అసెంబ్లీ భవనానికి 1449 కోట్లు

-మిగతా 2లో

# శ్రీవారి శ్రవణోత్సవం నేడు




- నగర వీధుల్లో హరినామ సంకీర్తనలు
- క్షీర, పంచామృతాభిషేకాలతో విశేష పూజలు
- సాయంత్రం పంచహారతులు, భజన కార్యక్రమాలు
- పవళింపు సేవతో ముగింపు

**శ్రీకాకుళం, నవతరం ప్రతినిధి:**

శ్రీకాకుళం పట్టణంలోని శ్రీ భూమిదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా ఈ నెల 12వ తేదీ ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఉదయం ప్రాతఃకాలంలో శ్రీవారి సేవకుల ఆధ్వర్యంలో నగర వీధులలో హరినామ సంకీర్తనలు నిర్వహించబడతాయి. అనంతరం ఆలయ అర్చకులు శ్రీ బూరాడ వంశీ కృష్ణమాచార్యులు వారి చేత శ్రీవారు, అమ్మవార్లకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించబడును.

సాయంత్రం శ్రీవారికి ప్రీతికరమైన పంచ హారతులు, భజనాది కార్యక్రమాలు నిర్వహించబడతాయి. చివరిగా పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులందరినీ కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని ఆహ్వానించారు.

# గర్భాశయ క్యాన్సర్ నుంచి హెచ్ పీవీ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుంది

- ఈ టీకాతో దీర్ఘకాలిక రక్షణ - ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్
- 9-14 ఏళ్ల వయస్సులో టీకా తీసుకోవడం అత్యంత అనుకూలం
- అల్లు అర్జున్ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా హెచ్ పి వి వ్యాక్సిన్ పోస్టర్ ఆవిష్కరణ



**నవతరం -శ్రీకాకుళం**

గర్భాశయ క్యాన్సర్ నుంచి హెచ్ పీవీ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుందని ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని సింహద్వారం సమీపంలో ఉన్న డాక్టర్ దానేటి శ్రీధర్ హాస్పిటల్ లో బుధవారం ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా పివిసి వ్యాక్సిన్ ప్రాముఖ్యత వివరిస్తూ అభిమానులు రూపొందించిన పోస్టర్ ను డాక్టర్ దానేటి శ్రీధర్ ఆవిష్కరించారు. డాక్టర్ దానేటి శ్రీధర్ ఆధ్వర్యంలో ఉచితంగా 175 మంది విద్యార్థులకు పివిసి వాక్సిన్ వేసామని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9-14 ఏళ్ల వయస్సులో టీకా తీసుకోవడం అత్యంత అనుకూలమని అయితే 45 ఏళ్ల వరకు కూడా తీసుకోవచ్చునని వివరించారు. టీకా వైరస్ బారిన పడకముందే తీసుకుంటే, ఇది చాలా ప్రభావవంతంగా పనిచేస్తుందని, దీర్ఘకాలిక రక్షణను ఇస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాక్సిన్ 90 శాతం కంటే ఎక్కువ హెచ్ పివి -ఆధారిత క్యాన్సర్లను నిరోధించగలదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా

-మిగతా 2లో

# రైతు కష్టాలు పర్వతం... ప్రభుత్వం స్పందన శూన్యం

- మార్పు మన్మధరావు ఆగ్రహం
- గార మండలంలో 1400 ఎకరాల్లో జొన్న సాగు
- క్వింటాల్ ధర 1500-1600కి పతనం... రైతులకు భారీ నష్టం
- గతంలో 2400 మద్దతు... ఇప్పుడు ఆ సహాయం లేక ఇబ్బందులు
- జొన్న రైతులు నష్టాల్లో కూరుకుపోతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని గారా మండలానికి చెందిన మార్పు మన్మధరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



**(నవతరం గార)**

శ్రీకాకుళం జిల్లా గార మండలంలో ఈ సీజన్‌లో సుమారు 1400 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. మంచి దిగుబడి వస్తుందన్న ఆశలతో పంట పండించిన రైతులకు, మార్కెట్‌లో ధరలు పడిపోవడం గట్టి దెబ్బగా మారింది. ప్రస్తుతం క్వింటాల్ జొన్న ధర 1500 నుండి 1600 మధ్య ఉండటంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు.
వ్యవసాయానికి పెట్టే

-మిగతా 2లో

ఎడిటోరియల్

# ఒంటరి ట్రంప్!

డోనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ అనే పండుగాడి దెబ్బతగిలింది.
మైండ్ బ్లాక్ లేదా బ్లాంక్ (పనిచేయటం మానింది లేదా ఖాళీ) అయినట్లు కనిపిస్తోంది. బుధవారం నాడు అతగాడి మాటలను చూస్తే ఎవరికైనా అదే అనిపిస్తుంది, కనిపిస్తుంది. దాడులను ఎప్పుడు నిలిపివేస్తారో, అసలు ఇరాన్‌తో ఏ అంశాలపై ఒప్పందాన్ని అమెరికా కోరుకుంటున్నదో బుర్రవున్న వారికెవరికీ అర్థం కావటం లేదు. పొంతన లేని మాటలు. ఇరాన్ అణుకార్యక్రమాన్ని ధ్వంసం చేస్తా అన్నాడు, ఇప్పుడు అది శుద్ధి చేసిన యురేనియంతో తనకు పనిలేదంటాడు. ఒప్పందం కుదిరినా లేకున్నా దాడులు నిలిపివేస్తానంటాడు. కీలక లక్ష్యాల సాధనకు దగ్గరలో ఉన్నామని చెబుతాడు, పూర్తి చేశామంటాడు, అయినా ఇంకా రెండు మూడు వారాలు దాడులు కొనసాగుతాయని మాట్లాడటాన్ని చూస్తే బుర్ర ఖరాబైందన్నది స్పష్టం.
నాటో దేశాల మీద విరుచుకుపడిన ట్రంప్ అవి ఏకం కావటానికి పుణ్యం కట్టుకున్నాడు. అమెరికాతో పని లేకుండానే హోర్ముజ్ జలసంధి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు నాటోలోని 35 దేశాలు నడుంకట్టాయి. ఆ ప్రయత్నం ఫలిస్తుందా లేదా అన్నది పక్కన పెడితే తమను కాగితపు పులి, తాను లేకపోతే నాటో లేదన్న ట్రంప్ ఆపహాస్యపు మాటలతో ఇప్పటి వరకు మొద్దు బారిన నాటో చర్మం స్పందిస్తున్నట్లు కనిపిస్తున్నది. తన పౌరులను ఉద్దేశించి బుధవారం నాడు చేసిన ప్రసంగంలో కొత్త విషయాలేమీ లేవు. రెండు మూడువారాల్లో ఇరాన్‌పోరు ముగుస్తుంది. కీలక లక్ష్యాల సాధన ముగింపు దశలో అమెరికా మిలిటరీ ఉంది. భవిష్యత్‌లో హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు దిగుమతులు చేసుకోము. శాంతి ఒప్పందానికి ఇరాన్ ముందుకు రాకపోతే దాని విద్యుత్ కేంద్రాలను నాశనం చేస్తాం. రాతియుగం కాలం నాటికి ఇరాన్‌ను వెనక్కు నెడతాం. ఇవీ ట్రంప్ ప్రసంగ ముఖ్యాంశాలు.
అనేక ప్రశ్నలు, సందేహాలకు ఎలాంటి సమాధానం లేదు. ఇతరుల కోసమే తాము దాడులు చేస్తున్నట్లు గతంలో చెప్పిన ట్రంప్ ఇప్పుడు తమకు చమురు అవసరం లేదని ఎవరికి కావాలంటే వారు చూసుకోవాల్సిందే అని తేల్చి చెప్పాడు. బడాయి, పోసుకోలు కబుర్లుగాకపోతే దాడులు చేయాలని అసలు ట్రంప్‌ను ఏ దేశం కోరింది? ఒప్పందానికి టెహరాన్ తహతహ లాడుతోందన్న ట్రంప్ మాటలను ఇరాన్ అపహాస్యం చేసింది. దాని మిలిటరీ శక్తిని నాశనం చేశామని చెప్పిన ట్రంప్ ప్రసంగం ముగిసిన వెంటనే పెద్ద ఎత్తున ఇజ్రాయిల్, గల్ఫ్‌లో అనేక కేంద్రాలపై క్షిపణుల ప్రయోగం జరిగింది. ఆయా ప్రభుత్వాల మీద వత్తిడి తెచ్చే ఎత్తుగడలలో భాగంగా తాము అమెరికా, ఐరోపా, ఇరుగు పొరుగుదేశాల పౌరులకు వ్యతిరేకం కాదని ఇరాన్ అధ్యక్షుడు మసూదు పెజెషకియాన్ ప్రకటించాడు.
అదిరింపులు బెదిరింపులతో ఇరాన్‌ను దారికి తెచ్చుకోలేమన్న ఇంగిత జ్ఞానం నెలరోజుల దాడుల తరువాత కూడా ట్రంప్‌కు కలగలేదు. 'మన దేశానికి ముప్పు తప్పించేందుకు అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటైన ఇరాన్ మీద 32 రోజులుగా దాడులు చేస్తున్నామని, ఇంకా కొనసాగినా భరించాల్సిందే' అన్నట్లు తన 19 నిమిషాల ప్రసంగంలో ట్రంప్ చెప్పాడు. ఇంధన ధరల పెరుగుదలతో సాధారణ పౌరుల నుంచి తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో దీనికి కారణం ఇరానే అని జనాన్ని నమ్మించేందుకు ప్రయత్నించాడు. అసలు దాడులను ప్రారంభించింది తానే అన్న చిన్న విషయం కూడా తెలియనంత అమాయకంగా అక్కడి పౌరులున్నారా? ట్రంప్ ఉపన్యాసం అమెరికన్లకు ఇబ్బందికరంగా, అసంగతంగా, ఆందోళనకు గురిచేసేదిగా ఉందని, తమ విజయం గురించి చేసిన ప్రసంగంలా ఉందని ఇరాన్ చూస్తున్నదనే వ్యాఖ్యలు వెలువడ్డాయి. ట్రంప్ చర్యలు మన ప్రధాని నరేంద్రమోడీకి ఇంకా జ్ఞానోదయం కలిగించినట్లు లేదు. కానీ, గతంలో అనేక దుర్మార్గాల్లో భాగస్వాములైన నాటో దేశాలకు కనువిప్పు కలిగించినట్లు చెప్పవచ్చు. తోడు దొంగల మధ్య పంపకాల్లో తేడాలు వచ్చినపుడు కీచులాడుకుంటారు, తిరిగ ఒక్కటౌతారు, అలాగే నాటో దేశాల వైఖరిని కూడా చెప్పలేం గానీ ఇరాన్ విషయంలో మాత్రం ఇప్పటి వరకు స్పష్టంగా ఉన్నాయి. నాటో నుంచి వైదొలుగుతామని ట్రంప్ బెదిరించాడు, అదే జరిగితే ఏం చేయాలనే మల్లగుల్లాలు ఆ కూటమిలో మొదలయ్యాయి. మన ఖర్చు మనమే పెట్టుకుంటున్నపుడు అమెరికా పెత్తనం ఏమిటన్నది కూడా ఆ దేశాల్లో ఉన్నది. అమెరికాతో తెగతెంపులు చేసుకోవటం ఐరోపాకు అంత తేలిక కాదు. ఒక వేళ నాటో విచ్ఛిన్నమైతే తమ భద్రత గురించి కొన్ని దేశాలు ఇప్పటికే ఆలోచిస్తున్నాయని వార్తలు. అమెరికా యుద్ధ విమానాలకు తమ గగనతలాన్ని వినియోగించుకొనేందుకు వీల్లేదని కొన్ని నాటో దేశాలు స్పష్టం చేశాయి. తమ మౌలిక ప్రయోజనాలకే ముప్పు వస్తుందనుకుంటే అమెరికన్ సామ్రాజ్యవాదులు రంగంలోకి దిగి అవసరమైతే ట్రంప్‌ను ఇంటికి సాగనంపినా ఆశ్చర్యం లేదు. అదే జరిగితే అతన్ని నమ్ముకున్న నరేంద్రమోడీ వంటివారి సంగతేమిటి? రాముడేం చేస్తాడో మరి!!

# హక్కుల పోరాటానికి ఐఎఫ్డబ్ల్యుజే సిద్ధం

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా సుమారు 50 వేల మంది సభ్యులతో ఐ ఎఫ్ డబ్ల్యూ జె బలమైన వేదికగా నిలిచిందని, జర్నలిస్టుల ట్రేడ్ యూనియన్ సంఘం గా గుర్తింపు పొందిందన్నారు. ఇటీవలి కాలంలో జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులు పత్రికా స్వేచ్ఛకు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ సమస్యలపై త్వరలోనే రాజీలేని ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. "జర్నలిస్టుల హక్కుల సాధనలో ఎలాంటి రాజీ ఉండదు... అందరూ ఐక్యంగా ముందుకు రావాలి" అని ఈశ్వరరావు అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసపు జోగినాయుడు మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. "మీడియా బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది... జర్నలిస్టుల గౌరవం కాపాడాలి" అని శాసపు జోగినాయుడు పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఉత్తరాంధ్ర రీజనల్ సమన్వయకర్త ఎం.వి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. "ప్రతి జర్నలిస్టు ఐఎఫ్డబ్ల్యుజే లో సభ్యత్వం చేరి ఐక్యంగా నిలిస్తేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది" అని మల్లేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో తాత్కాలిక కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు చేపట్టి, త్వరలో మహాసభ నిర్వహించి పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాత్కాలిక కమిటీలో సిరిగిరి నవచైతన్య, జయవర్ధన్ బి, బాబ్జి, బుడుమూరు, విశ్వేశ్వర (నాని), బి. శ్రీనివాస్, కె. రాము, దోలా క్రాంతి తదితరులు సభ్యులుగా ఉన్నారు.
ఈ సందర్భంగా శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి హాజరైన జర్నలిస్టులు తమ వృత్తిపరమైన సమస్యలను వివరించారు. కార్యక్రమంలో, విశాఖపట్నం కన్వీనర్ కొంంచెం అప్పలస్వామి నాయుడు, కో భగవాన్ వివిధ మండలాల నుంచి వచ్చినశ్రీరాములు నాయుడు, కళ్యాణ్ చక్రవర్తి, చౌదరి సత్యనారాయణ, చంద్ర,జీవి నాగభూషణరావు, పీ రమణారావు, పీ వాసు, ఎ సూర్య, ఎం విష్ణు, ఏ ఒమామహేశ్వరరావు, బీ నారాయణరావు, కే మురళీకృష్ణ, బీ గోపాలకృష్ణ,ఏ రవి, జయప్రకాశ్ నాయుడు. తదితరులు పాల్గొన్నారు.

# గర్భాశయ క్యాన్సర్ నుంచి హెచ్ పీవీ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుంది

మొదటిపేజీ తరువాయి

ఉచితంగా అందిస్తున్న ఈ వ్యాక్సిన్ వినియోగించుకోవాలని కోరారు. హెచ్ పివి ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి జననేంద్రియ స్పర్శ ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇది చాలా తరచుగా లైంగిక సంపర్కం (జననేంద్రియ, నోటి, పాయువు) ద్వారా జరుగుతుందని చెప్పారు. కానీ లైంగిక సంపర్కం లేకుండా కూడా జననేంద్రియాల మధ్య స్పర్శ ద్వారా ఈ వైరస్ వ్యాపించగలదని వివరించారు.
మొదటి డోస్ తీసుకున్న ఒకటి నుండి రెండు నెలల తర్వాత రెండవ డోస్, ఆరు నెలల తర్వాత మూడవ డోస్ తీసుకోవాలన్నారు.
మొదటి డోస్ తీసుకున్న ఒకటి నుండి రెండు నెలల తర్వాత రెండవ డోస్, ఆరు నెలల తర్వాత మూడవ డోస్ తీసుకోవాలి.
సినీ నటుల అభిమానులు ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని చెప్పారు.

# అమరావతి ఒక అంతులేని దోపిడీ..

మొదటిపేజీ తరువాయి

భవనాల అంచనాలు భారీగా పెంచి చూపడం ఎవరి జేబులు నింపడానికని ప్రశ్నించారు. 2014 -19 పోలవరం ప్రాజెక్టును ఏ టీ ఏం కార్డులా వాడుకున్నారని ఇప్పుడు అమరావతిని ఏ టి ఎం లా వాడుతున్నారని ఎద్దేవ చేశారు.
కేవలం గత ఏడు ఏళ్లలో అమరావతి నిర్మాణానికి రూ. 8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ లెక్కన రాజధాని పూర్తి కావడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు.? కేవలం ఈ 22 నెలల్లో 3లక్షల55 వేల కోట్లు అప్పు చేశారని ఈ పరిస్థితుల్లో రెండు లక్షల కోట్లతో రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యమా అని ఈ రెండు లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారో ప్రజలకు తెలియజేయాలని ఆయన నిలదీశారు
ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన 'ప్లాన్-బి' (మావిగన్ - మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కారిడార్) ప్రాముఖ్యతను ఆయన వివరించారు. 110 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పటికే మచిలీపట్నం పోర్టు, గన్నవరం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్, విజయవాడ గుంటూరు రైల్వే జంక్షన్లు మరియు కృష్ణానది అటు పోలవరం కుడి కాలువ ద్వారా పుష్కలమైన నీటి వనరులు, ఎన్ టి టి పి ఎస్ థర్మల్ తో పాటు పోలవరంలో 960 మెగావాట్ల జల విద్యుత్ కావలసినంత ఇశీదన వనరులు ఉన్నాయని అమరావతికి పెట్టే ఖర్చులో కేవలం 10 శాతం ఇక్కడ పెడితే ఇది ప్రపంచస్థాయి నగరంగా మారుతుందని తెలిపారు. పోర్టు అనుసంధానంగా ఉన్న వేగంగా అభివృద్ధి చెందిన చెన్నై ముంబై నగరాలు సరసన మావిగన్ చేరుతుందని హైదరాబాద్ చెన్నై బెంగళూరు వంటి నగరాలతో వేగంగా పోటీపడి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.
అదేవిధంగా మావిగన్ నమూనాలో నాలుగు కార్పొరేషన్లు రెండు మున్సిపాలిటీలు ఉండడమే కాకుండా 60 లక్షల పైగా జనాభా ఉండడం వలన ఈ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు
శివరామకృష్ణ కమిటీ సూచనల మేరకు వికేంద్రీకరణే సరైనదని, అందుకే జగన్ గారు మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని.. కానీ బాబు అండ్ కో విషప్రచారంతో దానిని అడ్డుకున్నారని మండిపడ్డారు అమరావతి నిర్మాణంలో ఎక్కడా లేని విధంగా చదరపు అడుగు కి 14 వేలు ఖర్చు చేస్తున్నారు అదే విధంగా దేశంలో ఆరు లైన్ల జాతీయ రహదారి కిలోమీటర్ కు 20 కోట్లు చొప్పున నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తుంటే అమరావతిలో కిలోమీటర్ కి 53 కోట్లు చొప్పున ఖర్చు చేస్తున్నారని అదేవిధంగా రాజధానిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ లో సచివాలయం టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల డిజైన్లకు 401 కోటి ఖర్చు చేశారని దేశంలో ఎక్కడైనా డిజైన్లకు ఇశీత ఖర్చు చేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు మావిగన్ ప్రజల్లో మంచి స్పందన రావడంతో దానిని డైవర్ట్ చేయడం కోసం ఏబీఎన్ రాధాకృష్ణ వైయస్సార్ పార్టీ నాయకులు పై మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం బాధాకరంగా ఉన్నాయన్నారు ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అని తమ్మినేని సీతారాం అన్నారు చివరగా ఉత్తరాంధ్రలో జరుగుతున్న భూ కుంభకోణాలపై కూడా తమ్మినేని తీవ్రంగా స్పందించారు.
మూలపేట పోర్టుకు జగన్ గారు అన్ని అనుమతులతో 70 శాతం పనులు పూర్తి చేస్తే, ఇప్పుడు 'బాబాయ్-అబ్బాయిలు' మరో 15 వేల ఎకరాల భూసేకరణ పేరుతో కొత్త దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా ఉద్యమాల పురిటిగడ్డ అని,రైతుల భూములతో ఆడుకుంటే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అమరావతి ముసుగులో జరుగుతున్న ఈ దోచుకో-పంచుకో-తినుకో విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని,త్వరలోనే దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దుంపల లక్ష్మణరావు రణస్థలం ఎంపీపీ పిన్నింటి సాయి కుమార్ శ్రీకాకుళం ఎంపీపీ అంబటి శ్రీను రాష్ట్రా ఇంటలెక్చువల్ కార్యదర్శి పిల్లల రామకృష్ణ హెచ్చర్ల జడ్పీటీసీ సనపల నారాయణరావు కొత్తూరు మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ సీనియర్ న్యాయవాది సింగుపురం మోహనరావు ఆమదాలవలస మాజీ జడ్పీటీసీ బొడ్డేపల్లి నారాయణరావు జిల్లా వైఎస్ఆర్ పార్టీ యువత అధ్యక్షులు మార్పు పృద్వి ద్వారపూ అజిత్, సీపాన వెంకట్రావు తదితరులు పాల్గున్నారు.

# సంస్థల నందు ఉపాధి

# జాబ్ మేళా నిర్వహణ

**నవతరం -శ్రీకాకుళం**
జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (DRDA) మరియు స్కిల్ డెవలప్‌మెంట్ (SEEDAP) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించబడుతున్నదని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.
ఈ మేళా 09-04-2026 తేదీన ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎచ్చెర్ల (Etcherla) మండలంలోని MRO కార్యాలయం ప్రాంగణంలో (TTDC సమీపంలో) నిర్వహించబడుతుందనీ, ఈ ఉద్యోగ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా KIA Wooyoung DSC Hmaseung (BISAFE) కంపెనీవారు నిర్వహించే అసోసియేట్ మరియు టెక్నీషియన్ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, బీటెక్, ఎం టెక్, విద్యార్హతలు కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 28 సంవత్సరముల లోపు గల నిరుద్యోగ యువతకు బెంగుళూరు మరియు చెన్నై లో పనిచేయవలసి ఉంటుందని వీరికి నెలకు 15000 నుండి 17000 వరకు జీతంతో పాటు ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుంది తెలిపారు. Big Basket (KL Technical Service) కంపెనీవారు నిర్వహించే వేర్ హౌస్ అసోసియేట్ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, విద్యార్థులు కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 30 సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు హైదరాబాద్ లో పనిచేయవలసి ఉంటుందని వీరికి నెలకు 19,000 నుండి 23000 జీతం చెల్లిస్తూ సబ్సిడీ భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. Dazzle Sports Wear Pvt. Ltd. కంపెనీవారు నిర్వహించే సీవింగ్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఐదవతరగతి నుండి పదవ తరగతి విద్యార్హతో పాటు సీవింగ్ ఆపరేటర్ అనుభవం ఉండి 18 సంవత్సరములు నుండి 35 సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు నెలకు 16 వేల జీతంతో పాటు ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్లు వీరు హైదరాబాద్ లో పనిచేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. Hetero Groupకంపెనీవారు నిర్వహించే కెమిస్ట్ జూనియర్ మరియు టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటిఐ ఫిట్టర్స్, ఎలక్ట్రీషియన్స్, ఇంటర్, బీకాం, బి ఎస్ సి కెమిస్ట్రీ, మరియు ఎమ్మెస్సీ విద్యార్హతలు కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 26 సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు హైదరాబాద్ లో పనిచేయవలసి ఉంటుందని వీరికి 2.30 నుండి 2.80 వరకు ప్యాకేజీ చెల్లించనున్నట్లు తెలిపారు. Greentech Industries India Pvt. Ltd.కంపెనీవారు నిర్వహించే మిషన్ ట్రైనీ ఆపరేటర్ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమా, బీటెక్, (మెకానికల్) విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 32. సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు నాయుడుపేటలో పనిచేయవలసి ఉంటుందని వీరికి నెలకు 12000 నుండి 14000 వరకు జీతంతో పాటు 500 బోనస్ మరియు ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుంది తెలిపారు. కొన్ని సంస్థల్లో ఉచిత భోజనం, వసతి మరియు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. పని ప్రదేశాలు: హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, నైడుపేట తదితర ప్రాంతాల్లో పనిచేయవలసి ఉంటుందని, వివిధ విభాగాల్లో అసోసియేట్, టెక్నీషియన్, వేర్‌హౌస్ అసోసియేట్, సివింగ్ ఆపరేటర్, కెమిస్ట్, మెషిన్ ట్రైనీ ఆపరేటర్ వంటి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు మరియు అవసరమైన ధ్రువ పత్రాలతో హాజరుకావాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రైతు కష్టాలు పర్వతం... ప్రభుత్వం స్పందన శూన్యం

మొదటిపేజీ తరువాయి

ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎరువులు, కూలీల ఖర్చులు, నీటి వ్యయం అన్ని కలిపి రైతులపై భారీ భారం పడుతోంది. ఈ నేపథ్యంలో సరైన ధర లేకపోవడంతో రైతులు పెట్టుబడులు కూడా తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జొన్న రైతులకు క్వింటాల్‌కు సుమారు 2400 వరకు మద్దతు లభించేది. ఆ సాయం రైతులకు కొంత భరోసా కల్పించింది. కానీ ప్రస్తుతం అలాంటి మద్దతు లేకపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఈ నేపథ్యంలో మన్మధరావు ప్రభుత్వాన్ని నిలదీస్తూ, జొన్న రైతులకు కనీస మద్దతు ధర (MSP) ప్రకటించి, గతం కంటే మెరుగైన రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా గార మండల రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే, ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని మన్మధరావు హెచ్చరించారు. రైతుల కష్టాలను గుర్తించి, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# సమాచార లోపంతోనే సమస్యలు

మరో వందేళ్ల తర్వాత కూడా మనిషికి ప్రత్యామ్నాయం దొరకదు. సమాజం ముందుకు వెళ్లాలంటే మానవ సంబంధాలు చాలా ముఖ్యం. ఈ పోటీ ప్రపంచంలో మనిషి ఒంటరి అవుతున్నాడు. ఎన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, మనిషిని ఏదో వెంటాడు తూనే ఉంది. అదే ఇతరులతో పోల్చుకోవడం.

మానవ బంధాలు దెబ్బ తినడానికి అనేక కారణాలు ఉన్నాయి. సమాచారం లోపం ఇందులో ఒకటి. ఇది భావ వ్యక్తీకరణ లోపంలో ఒక భాగం. చూడటానికి ఇవి రెండూ ఒకేలా కనిపిస్తాయి.

భావ వ్యక్తీకరణ అనేది ఒక కళ. ఇది అందరికి రాదు. ఇందులో భావొద్వేగాలు కూడా ఇమిడి ఉంటాయి. కొందరు చిరు నవ్వుతోనే ఎదుటి వారిని కట్టి పడేస్తారు. భావ వ్యక్తీకరణకు మనం వాడే భాష చాలా ముఖ్యం.

పైన అనుకున్నట్లు సమాచార లోపం అనేది ఇందులో ఒక భాగం. ఇది అనేక రకాలుగా ఉంటుంది. మనం ఒక వేడుక చేసుకుంటాం. ఒక్కోసారి బాగా తెలిసిన వారిని పిలువ లేక పోతాం. ఇది సమాచార లోపం కాదు. అ పనిని వేరే వారికి అప్పగిస్తాం. అది వారు చేయక పోవచ్చు.లేదా పని ఒత్తిడిలో మర్చి పోవచ్చు.

ఒక్కోసారి మన మనసులో ఎటువంటి దురుద్దేశం ఉండకపోవచ్చు. మన అభిప్రాయాన్ని ఒక విషయం గురించి తెలిపి నప్పుడు అది వేరే వారికి ఇంకో రకంగా అర్థం అవ్వొచ్చు. అంటే చెప్పడంలోనో లేదా వారు వినడంలోనో ఏదో కొద్ది పాటి లోపం జరిగి ఉండవచ్చు.దీన్ని భావ వ్యక్తీకరణ లోపం అంటారు.

సాధారణంగా ఎదుటి వారి గొప్ప తనాన్ని గురించి చెప్పేటప్పుడు మనకు పెద్దగా నైపుణ్యాలు అవసరం ఉండదు. కానీ ఎదుటి వారి లోపాలు గురించి చెప్పేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఇటువంటి విషయాల ప్రస్తావన లేకుంటే బావుంటుంది.

ఒక్కోసారి మనం చెప్పిన విషయానికి ఇంకొకరు ఒకటో రెండో విషయాలు జోడించి చెప్తారు. లేదా చెప్పిన విషయాన్ని ఇంకో రకంగా అర్థం చేసుకుంటారు. అది చివరికి చేరే వారికి చేరే సరికి దాని పూర్తిగా మారిపోతుంది. సమాచార లోపంతోనే మనకు ఎక్కువగా సమస్యలు వస్తుంటాయి. నేను మొన్నా మధ్య తెలిసిన ఓ వ్యక్తి గురించి ఇలా అన్నాను. పాపం.. అతను చాలా మంచి వాడు. చాలా అమాయకుడు అన్నాను. రెండు రోజుల తర్వాత అ వ్యక్తి ఫోన్ చేసి నా గురించి ఏదో అన్నావట. నేను అమాయకుడిని అట.. నాకేమి తెలియదన్నావటగా..

కానీ.. నా ఉద్దేశం వేరు. చెప్పిన సమాచారాన్ని సరిగ్గా వినకుండా ఉండటం లేదా దాన్ని వేరేగా అర్థం చేసుకోవడం లేదా విన్న సమాచారానికి సొంత భాష్యం జోడించడం వంటి వల్ల ఇటువంటి సమస్యలు వస్తాయి. దీని వల్ల మానవ బంధాలు దెబ్బ తింటాయి. వాస్తవానికి ఇటువంటి సమస్యల్లో పెద్దగా ఆస్తుల గొడవలు వంటివి ఏమి ఉండవు. ఒక్కోసారి సరదా కబుర్లే కొంపలుఆర్పుతాయి.ముఖ్యంగా ప్రముఖులు ఇటువంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

**మరి ఏం చేయాలి..?**

సరదాగా మాట్లాడుకోవడం మానవ నైజం. అయితే పదే పదే ఎదుటి వారి ప్రస్తావన రాకుండా ఉంటే బావుంటుంది. ఏదైనా సమాచారం ఇచ్చేటప్పుడు క్లుప్తంగా ఇవ్వాలి.సమాచారం ఎక్కువగా వున్నప్పుడు రాసి పంపితే బావుంటుంది. కొన్ని ముఖ్యమైన విషయాలు ఫోన్లో మాట్లాడ కూడదు. ప్రత్యక్షంగా కలిసి చర్చించుకుంటే మంచిది. ఆలా కుదరలేదు అనుకుంటే ఎదుటి వారికి ఖాళీ ఉండేలా చూసుకోవాలి.

ప్రతి మనిషికి ఓ పరిధి ఉంటుంది. మనకు అన్ని పనులు చేయగల సామర్థ్యం ఉన్నప్పటికీ, పని విభజన చేసుకోవాలి. లేదంటే పనిలో నాణ్యత లోపిస్తుంది. పని ఒత్తిడి పెరిగి సమాచారాన్ని సరిగ్గా అందించలేము.

ఎదుటి వారితో పోల్చుకోవడం అనవసరం. ఎవరి స్థాయి వారికి ఉంటుంది. పోలికల వల్ల అసూయ, ద్వేషం పెరుగుతుంది. కష్టం లేకుంటే ఎవరికీ ఏది తొందరగా చేతికి రాదు. చివరిగా చెప్పేది ఏమిటంటే మంచి ఉంటే మైకులో చెప్పమన్నారు. చెడు ఉంటే చెవిలో చెప్పమన్నారు. ఇది సద్విమర్శలో ఓ భాగం.



యం.రాం ప్రదీప్

# కుల వివక్ష ఒక శిలువ శిక్ష..?




కులం ఒక రక్కసి...
కులం ఒక జాడ్యం...
కులం ఒక కుడ్యం...
కులం ఒక మౌఢ్యం...!

కులం ఒక కుళ్ళు...
కులం ఒక ముల్లు...
కులం మత్తు మందు...
కులం కొందరికి విందు...!

కులం ఒక విషం...
కులం ఒక విషవృక్షం...
కులం ఒక రావణకాష్టం...
కులం కొందరికి కులదైవం...!

కులం ఒక గజ్జి కుక్క...
కులం ఒక అంటువ్యాధి...
కులం ఒక మండే కుంపటి...

కులం ఒక జాతికి శాపం
కులంతో ఒక జాతి సర్వనాశనం..!

వద్దు వద్దు అస్పృశ్యత...
వద్దు వద్దు అంటరానితనం...
వద్దు వద్దు కులదురాచారం...
వద్దు వద్దు కుల దురహంకారం...!

కులాన్ని
ముళ్ళకిరీటంలా
ధరించినవాడు...!

ఆకాశంలో
నక్షత్రాలన్ని
అవమానాలను
భరించినవాడు...!

నేడు భారతావనిలో

కులం ఆరక రగిలే ఒక
అగ్నిగుండం..!

కులం ఒక కాలసర్పం...
కులం ఒక కరోనా వైరస్...
కులం ఒక పిడుగుల వర్షం...
కులం ఒక నాలుగు పడగల
నాగరాజు.!

కులం చాపకింద నీరే...
వద్దు వద్దు కులం వద్దు...
కుల నిర్మూలనే ముద్దు...
వద్దు కులం పేర
కుమ్ములాటలు...!

కులం ఒక శిలువ శిక్ష...
వద్దు వద్దు కులవివక్ష...

“కులం ఒక కుళ్ళని...
దాన్ని కడగడానికి
చాలవు “కడలిలోని నీళ్ళని...!

పలికిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్
భావిభారత నవసమాజ నిర్మాతలైన
యువశక్తి కిచ్చే సందేశం ఒక్కటే...!

తక్షణమే కులాన్ని రద్దు చేయాలని..
ఆరని కుల కుంపటిని ఆర్పాలని...
కుల నిర్మూలన చట్టం తేవాలని...
కులాంతర వివాహాలు పెరగాలని...!

ప్రేమ...శాంతి...సహనం...
స్వేచ్ఛా....స్వాతంత్ర్యం....
సమానత్వం...సౌభ్రాతృత్వం...
పునాది రాళ్ళుగా...కులరహిత
నవసమాజ నిర్మాణం జరగాలని...!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్



# నేనింకా హద్దులు దాటలేదు!

ప్రేమకు ఎల్లలు లేవంటారు. ప్రేమలో ఉండేవారు హద్దులు పెట్టుకోరని అంటారు. ఇదే ప్రశ్న మృణాల్ కు ఎదురైంది. దీనికి ఆమె పరోక్షంగా సమాధానం ఇచ్చింది. తానింకా ప్రేమలో హద్దులు దాటలేదని చెప్పుకొచ్చింది. అంటే దానర్థం, మృణాల్ ప్రేమలో ఉందని.

రియల్ లైఫ్ లో తన ప్రేమకథ ఇంకా ప్రాసెస్ లో ఉందని.. అది తన జీవితంలోకి వచ్చినప్పుడు కచ్చితంగా చెబుతానంటోంది. తన ప్రేమ ఇంకా ప్రాసెస్ లో ఉందని, అతడు తన జీవితంలోకి వచ్చినప్పుడు కచ్చితంగా చెబుతానంటోంది. మృణాల్-ధనుష్ ప్రేమలో ఉన్నారంటూ, రీసెంట్ గా చాలా పుకార్లు చెలరేగిన సంగతి తెలిసిందే.

డెకాయిట్ ట్రయిలర్ లాంచ్ లో భాగంగా మీడియాతో మాట్లాడిన మృణాల్.. తను చాలా ప్రేమకథలు చేశానని, కానీ డెకాయిట్ లో ప్రేమ మాత్రం చాలా కొత్తగా ఉంటుందని చెబుతోంది. ఇందులో సరస్వతి అనే పాత్ర పోషించిన మృణాల్.. ఆ క్యారెక్టర్ లో ప్రేమలో పాటు పగ, ప్రతీకారం, కోపం కూడా చూపించానంటోంది.ఓ మనిషి పీకల్లోతు ప్రేమలో మునిగిన తర్వాత ఆ ప్రేమ భగ్నమైతే.. అందులోంచి కచ్చితంగా కోపం, పగ పుట్టుకొస్తాయని.. ఆ షేడ్స్ ను డెకాయిట్ లోని సరస్వతి పాత్రలో చూస్తారని చెబుతోంది.

ఇక ట్రయిలర్ విషయానికొస్తే.. టీజర్ లో ఓ మోస్తరుగా కథను వివరించిన దర్శకుడు, ట్రయిలర్ తో మాత్రం పూర్తి స్పష్టత ఇచ్చాడు. లవ్ అండ్ వార్ కాన్సెప్ట్ తో రాబోతున్న ఈ సినిమాలో హీరోహీరోయిన్ల పాత్రలపై ట్రయిలర్ తో పూర్తి స్పష్టత ఇచ్చాడు. ట్రయిలర్ తో సినిమాపై సరైన అంచనాల్ని సెట్ చేయగలిగారు. అన్నపూర్ణ స్టుడియోస్ బ్యానర్ పై షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిన డెకాయిట్ సినిమా 10న థియేటర్లలోకి రానుంది.

# అంతా ఫేక్ అనుకుంటుంటే కాదని చెప్పారు

ఏఐ రాకతో ఈ కాలం ఏది నిజమో, ఏది అబద్ధమో అర్థం కాకుండా అయిపోయింది. మరీ ముఖ్యంగా సినిమాల విషయంలో ఈ ఏఐ కంటెంట్ కొంప ముంచుతోంది. కానీ ఫౌజీ విషయంలో ఇది కాస్తా రివర్స్ అయింది.

ఫౌజీ సినిమా నుంచి ఊహించని విధంగా ఓ స్టిల్ లీక్ అయింది. ప్రభాస్ స్టయిలిష్ గా నిల్చొని సిగరెట్ కాలుస్తున్న పోజు అది. 80ల నాటి దుస్తులు ధరించి, భుజంపై కోటు వేసుకొని నిలబడ్డ ఆ స్టిల్ చూసి చాలామంది డీప్ ఫేక్ ఫొటో అనుకున్నారు. అందుకే సోషల్ మీడియాలో ఆ ఫోటో ప్రత్యక్షమవ్వగానే చాలామంది లైట్ తీసుకున్నారు. ఎవరో ఏఐతో జనరేట్ చేశారని అనుకున్నారు. కానీ యూనిట్ మాత్రం అది ఏఐ కాదని ఒరిజినల్ స్టిల్ అని తేల్చేసింది. సోషల్ మీడియాలో ఫౌజీ స్టిల్ లీక్ అయిన వెంటనే యూనిట్ నుంచి ప్రకటన వచ్చింది. తాము ఎంతో కష్టపడి సినిమా తీస్తున్నామని, అలా ఫొటోలు లీక్ చేయొద్దని ట్వీట్ వేసింది. కంటెంట్ లీక్ చేసిన వాళ్లపై చర్యలుంటాయని కూడా హెచ్చరించింది. ఈ ఒక్క స్టేట్ మెంట్ తో అది ఏఐ ఫొటో కాదని,




ఫౌజీ సినిమాలో ఫొటో అని జనానికి తెలిసిపోయింది. యూనిట్ స్టేట్ మెంట్ తర్వాత ఆ ఫొటో మరింత వైరల్ అయింది. యూనిట్ ఒకటి తలస్తే, ఇంకోటి జరిగిందన్నమాట. మనలో మనమాట ఫొటోలో ప్రభాస్ లుక్ మాత్రం అదిరింది.

# తెలంగాణ జాతిపిత ఎవరు?




తెలంగాణ జాతిపిత ఎవరు? రాష్ట్ర సాధనలో అసలు పాత్ర ఎవరిది? పూర్తి నిజాలు ఇవే జయశంకర్‌కు జాతిపిత గౌరవం ఎందుకు? కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాత్ర ఏంటి? తెలంగాణలో సాధారణంగా ప్రొఫెసర్ జయశంకర్ గారిని "జాతిపిత"గా గౌరవిస్తారు. కారణం ఆయన తెలంగాణ ఆలోచనకు పునాది వేసిన వ్యక్తి కావడం. ప్రాంతీయ అసమానతలు, నీటి పంపిణీ, ఉద్యోగ అవకాశాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని శాస్త్రీయంగా వివరించారు. ఉద్యమానికి సిద్ధాంత బలం ఇచ్చి, విద్యార్థుల్లో చైతన్యం పెంచారు.

మరోవైపు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ఉద్యమాన్ని రాజకీయంగా ముందుకు నడిపిన నాయకుడు. ఆయన నాయకత్వంలో ఉద్యమం ప్రజల్లో విస్తరించి, రాష్ట్ర సాధన దిశగా వేగంగా సాగింది.

తెలంగాణను ఎవరు సాధించారు? ఆలోచన ఎవరిది, సాధన ఎవరిది? పూర్తి వివరాలు తెలంగాణ రాష్ట్ర సాధన ఒక వ్యక్తి కృషి కాదు, అది సమిష్టి పోరాటం.

ఆలోచన, సిద్ధాంతం: ప్రొఫెసర్ జయశంకర్ గారు రాజకీయ నాయకత్వం: కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు

బలం: విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు 2001లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారు స్థాపించి ఉద్యమానికి రాజకీయ వేదిక కల్పించారు. 2009లో ఆయన చేసిన నిరాహార దీక్ష తెలంగాణ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ప్రజల భారీ మద్దతుతో ఉద్యమం శక్తివంతమైంది.

జాతిపితపై సందేహాలకు ఫుల్ క్లారిటీ: జయశంకర్ సిద్ధాంతం, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వం

"జాతిపిత" అనే గౌరవం సాధారణంగా ఒక ఉద్యమానికి పునాది వేసిన వ్యక్తికి ఇస్తారు. తెలంగాణ సందర్భంలో ఆ గౌరవం జయశంకర్ గారికి దక్కింది.

జయశంకర్ గారు ? ఆలోచనా దార్శనికుడు, సిద్ధాంత నిర్మాత

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారు ? కార్యాచరణ నాయకుడు, ఉద్యమాన్ని విజయానికి తీసుకెళ్లిన వ్యక్తి

అందువల్ల ఇద్దరి పాత్రలు వేర్వేరు అయినప్పటికీ, ఒకదానికొకటి అనుసంధానమై ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో నిజమైన పాత్రలు ఇవే: ప్రజలు, జయశంకర్, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కృషి తెలంగాణ ఉద్యమం విజయవంతం కావడానికి మూడు ప్రధాన శక్తులు కలిసి పనిచేశాయి: జయశంకర్ గారు ఉద్యమానికి ఆలోచనా దిశ ఇచ్చారు

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ఉద్యమాన్ని రాజకీయంగా నడిపించారు

ప్రజలు మరియు విద్యార్థులు ఉద్యమానికి అసలైన శక్తిగా నిలిచారు

విద్యార్థుల ఉద్యమాలు, "సకల జనుల సమ్మె", "మిలియన్ మార్చ్" వంటి కార్యక్రమాలు తెలంగాణ సాధనలో కీలక మలుపులు అయ్యాయి. ముగింపు: తెలంగాణ జాతిపితగా ప్రొఫెసర్ జయశంకర్ గారిని గౌరవించడం సాధారణంగా కనిపించే అభిప్రాయం. అయితే తెలంగాణ రాష్ట్ర సాధనలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి నాయకత్వం మరియు ప్రజల పోరాటం కూడా అంతే ముఖ్యమైనవి. తెలంగాణ ఏర్పాటుకు ఆలోచన, నాయకత్వం, ప్రజా శక్తి ఈ మూడు కలిసి పనిచేశాయి.

ఉద్దేశకుడు :
తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా ..
9297109223, హైదరాబాద్

# కంచి కామాక్షి - కామితార్థ ప్రదాయని



ఒకప్పుడు పార్వతీ పరమేశ్వరులు కైలాసంలో కూర్చుని పాచికలు ఆడుతూండగా, శివుడు ఓడిపోయాడు. పార్వతి గేలి చేసింది. అందుకు శివుడు కోపంతో పార్వతిని కురూపివై పొమ్మని శపించాడు. పార్వతి తన తప్పు తెలుసుకుని భర్తని ప్రార్థించగా, శాప విమోచన మార్గాన్ని చెప్పాడు.ఆ ప్రకారం పార్వతీ దేవి భూమి మీదికి వచ్చి, ఒకే ఒక్క పండును మాత్రమే కాచే ఒక మామిడి చెట్టు క్రింద కూర్చుని తపస్సు చేయడం ఆరంభించింది. అప్పుడు ఆ శివుడు ఆమెని పరీక్షించడానికి తన జటాజూటం నించి గంగని అమిత వేగంగా పారేలాగా చేసాడు. ఉధ్రుతంగా పొంగుకొస్తున్న ప్రవాహ ధాటికి పార్వతి భయపడి ఆ చెట్టు క్రింద తన రోజూ పూజ చేసుకోడానికి మట్టితో చేసుకున్న శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకుని ఉండి పోయిందట. అందుకు శివుడు సంతృప్తి చెంది. ఆమెకి ఉన్న కురూపితనాన్ని పోగొట్టి సుందరాంగిగా అనుగ్రహించాడు. నూతన సౌందర్యంతో ఆ ఊళ్లో వెలసిన పార్వతీ దేవికి అమిత ఆకర్షణీయ మైన కన్నులు ఉండడంతో ఆమెకి కామాక్షి అనే పేరు వచ్చింది. తరువాత కూడ పార్వతీ దేవి కోరికని అనుసరించి శివుడు ఆ ఒంటి పండు కాచే ఆ మామిడి చెట్టు (ఏకం ఆమ్రం) క్రిందనే ఉండిపోయాడు. అందువల్ల ఆయనకి ఏకామ్రనాథుడు అనే పేరు వచ్చింది. ఇప్పటికీ ఈ ఆలయంలో గర్భ గుడి వెనుకగా ఆ మామిడి చెట్టు ఉంది. భక్తులు ఆ మామిడి చెట్టుకి ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహిస్తుంటారు.

ఆదిశంకరాచార్యులవారు ఈ దేవికి నిత్య పూజ చేస్తుండే వారని ప్రతీతి. ఈ గుడిలోని అమ్మవారు రాత్రిపూట కాళికా రూపం ధరించి ఆలయం నుంచి వెలుపలికి వచ్చి ఊళ్లో జనాన్ని భయాన్ని కలిగిస్తుండేదట. ప్రజలంతా భయభ్రాంతులై పోతుండేవారట. శంకరాచార్యుల వారు కఠోరమైన తపస్సు చేసి ఆమెని ప్రసన్నురాలిని చేసుకుని తన అనుమతి లేనిదే ఆలయం దాటి బయటికి రాకుండా ఉండేలా వరం పొందాడు. దాని కోసమే ఆయన ఓ యంత్రాన్ని సిద్ధం చేసి అమ్మవారి విగ్రహం ఎదురుగా బంధ ప్రతిష్ఠ చేసారు. అమ్మవారి గర్భ ఆలయం వెనుకగా శంకరాచార్యుల వారి విగ్రహం ఇప్పటికీ మనం చూడవచ్చు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలని ఊరేగింపులకి గుడి బైటికి తీసుకురావలసిన సందర్భాలలో ఆయన గది ముందు ఆపి వారి అనుజ్ఞ తీసుకుని ఆ పైనే గుడి వెలుపలికి పంపబడటం సంప్రదాయం.

శివ కంచిలోని ఏకామ్రేశ్వరాలయా నికి వెళ్లే దారిలోనే రోడ్డుకి ఎడమ వైపున కైలాసనాథాలయం ఉంది. దీనిని పల్లవ రాజైన నరసింహ వర్మ కట్టించాడని చరిత్ర చెబుతుంది. ఈ దేవాలయం చాల గంభీరంగానూ, మంచి శిల్ప సంపదతోనూ నిండి ఉంటుంది.

దక్షిణ భారతదేశంలోని అతి పురాతన పట్టణాలలో కంచి కూడా ఒకటి కంచికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. క్రీస్తుపూర్వం 2000 సంవత్సరాలు పైనే అత్యంత వైభవంగా ఉన్న పట్టణమిది.

సుమారు ఆరవ శతాబ్ది పాదైన మొదటి మహేంద్ర వర్మ మొదటి జైన మతావలంబి అయిన తర్వాత హిందూ ధర్మానికి మారాడు. రెండవ నరసింహ వర్మ మహాబలిపురంలోని సముద్ర దేవాలయం,రాతి గుళ్ల నిర్మించడమే కాకుండా కంచిలోని కైలాసనాథ ఆలయం కూడా కట్టించాడు. ఈ పల్లవ రాజుల వంశంలో తర్వాతి కాలంవాడైన నందివర్మ విష్ణుకంచి లోని ఆలయాలు కట్టించాడు భారవి, దండి మహాకవులు ఈ ప్రాంతం వారే

కామకోటి పీఠం ఉన్న ద్వారం సరిగ్గా నాలుగు మార్గాల కూడలిలో ఉంటుంది. విష్ణు కంచికి వెళ్లే వాహనం అక్కడి నించే బయలుదేరుతుంది. ఇక్కడి నించి వరద రాజు స్వామి గుడికి సుమారు పావు గంటలో చేరుకోవచ్చు.

వరద రాజ స్వామి ఆలయం ఓ అద్భుతమైన కట్టడం. ఈ గుడి ఆవరణలో ముందు భాగంలో ఒక పుష్కరిణి, దాని పక్కనే ఒక కల్యాణ మండపం ఉన్నాయి. పల్లవ రాజులలో ఒకరైన నంది వర్మ ఈ ఆలయాలు కట్టించారని చెబుతారు.

ఒకప్పుడు ఈ ఆలయంలోని అర్చకుడు స్వామి వారికి అభిషేకం చేస్తూంటే, ఆ నీటిలో ఒక బల్లి వచ్చి పడిందట. దానికి గానూ ఆ అర్చకుడు బల్లిగా మారిపోయాడట. అయితే ఆయన స్వామి వారిని ప్రార్థించగా దర్శనానికి వచ్చిన భక్తులు ఒక్కొక్కరే బల్లి రూపంలో ఉన్న నిన్నూ,నీ శిష్యుని చేతితో తాకుతుంటారన్నాడు. ఫలితంగా భక్తులు వాటిని తాకుతూ ఆ పాపంలో భాగం పంచుకుంటారు.

కొన్నాళ్ళకి శాప విమోచన అవుతుంది. చాలామంది భక్తులు ఇప్పటికే ఇలా బల్లిని స్పృశించిన కారణంగా నా బల్లికి శాపం విమోచనమైపోయింది. కాబట్టి ఎప్పుడు బల్లిని స్పృశించిన అప్పటి పాపంలోని భాగం ఏ మాత్రమూ భక్తులకు అంటనే అంటదు. అయితే ఇప్పటికీ ఆ బల్లిని స్పెషల్ చేయడానికి కారణం ఆనాటి చరిత్రని మర్చిపోకుండా చేసుకోవడానికి మాత్రమే. గుడి లోపలి కప్పు పై భాగాన ఒకదానికి బంగారపు రేకు మరొకదానికి వెండి రేకులు తొడగబడిన రెండు బల్లి విగ్రహాలని భక్తులందరూ ఇప్పటికీ చేతితో తాకుతూ వెళ్తూ ఉంటారు. భక్తులు ఇలా చేయడం వల్ల వారిపై బల్లి పడిన దోషం ఏదైనా ఉంటే పోతుంది.

చంగల్పట్టు నుంచి అరకోణం రైలు మార్గం మధ్యలో కంచిపట్టణం ఉంది ఇది 15 మైళ్ళ లోపే ఉంటుంది కంచి నుంచి మద్రాస్ 60 కిలోమీటర్లు అరకోణం 29 కిలోమీటర్లు చెంగల్పట్ 37 కి.మీ 41 కిలోమీటర్లు తిరుపతి 110 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత



**నవతరం-పాలకొండ**

నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యతని పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. పాలకొండ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి నీటి సంఘాల అధ్యక్షులు, మెంబర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి భద్రత -సాగు నీటి సంఘాల బాధ్యత 100 రోజుల కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గంలో సాగునీటికి సంబంధించిన మదుములు, చెక్ డ్యామ్ లు, చెరువులు, సర్‌ప్లస్‌లు, డ్రాప్‌లకు సంబంధించిన పనులను ఎన్ఆర్ఈజీఎస్‌లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సీతంపేట మండలానికి సంబంధించిన నలినీకృష్ణ సాగరం, వీరఘట్టం మండలంలోని వెంకన్న చెరువు ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

# అల్లు అర్జున్ పేరిట అన్నదానం, రక్తదాన శిబిరాలు

- మైలపల్లి బన్ని సేవలు నిర్విరామం.
- న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా.టి.మణికంఠ



**నవతరం-రణస్థలం**

అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మైలపల్లి బన్ని సేవలు నిర్విరామమని, రణస్థలంలో అల్లు అర్జున్ అభిమానం సంఘం పేరిట అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా.టి.మణికంఠ రావు అన్నారు. అల్లు అర్జున్ జన్మదిన వేడుకలలో భాగముగా శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం, మెంటాడ గ్రామంలో బుధవారం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 44వ జన్మదినం పురస్కరించుకుని, అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ రణస్థలం వారు నిర్వహించిన అన్నదానం, రక్తదాన శిబిరాలకు భారీ స్పందన వచ్చింది. ఈ సందర్భంగా డా. .మణికంఠ రావు మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో సుమారు 54 మంది పాల్గొని రక్తదానం చేశారని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు, తలసీమియా బాధిత చిన్నారులకు తలపెట్టిన ఈ మహోత్తర కార్యక్రమానికి నన్ను కూడా భాగం చేశారన్నారు. వేసవిలో రక్త నిల్వాలు తక్కువ వుంటాయని, గర్భిణీలకు, వృద్ధులకు ఎక్కువ అవసరముంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా ఒక కారణమని, సమయానికి రక్తం అందించలేకపోతే ప్రాణాలకే ప్రమాదమన్నారు.




ఇందులో భాగముగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించి, పదిమంది ఆకలి తీర్చటం ఆనందంగా ఉందన్నారు. మైలపల్లి బన్ని మాట్లాడుతూ రణస్థలంలో అల్లు అర్జున్ అభిమానం సంఘం పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పదిమంది పేదల కడుపునింపటంలోగాని, వారి అవసరాలు తీర్చటంలో ఆ ఆనందమే వేరన్నారు. అనంతరం రక్త దాతలకు దుస్సాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ అభిమానం సంఘం ప్రతినిధులు, మైలపల్లి బన్ని స్నేహితులు, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు యాజమాన్యం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**